క్లుప్తంగా

సీఐ తిరుమలరావు బాధ్యతల స్వీకరణ



భీమునిపట్నం: భీమిలి పోలీస్ స్టేషన్ సీఐగా బి.తిరుమలరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. విశాఖ టూ టౌన్ సీఐగా పని చేస్తున్న ఈయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. గతంలో ఇక్కడ పనిచేసిన బి.సుధాకర్‌ను విశాఖ రేంజ్‌కు సరెండర్ చేయడంతో, ఆయన స్థానంలో తిరుమలరావు బాధ్యతలు స్వీకరించారు. సీఐ విలేకరులతో మాట్లాడుతూ శాంతిభద్రతల విషయంలో ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పీఎం పాలెం: స్థానిక 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 11కేవీ ఎంవీవీ ఫీడర్ ఏరియాలో ఆదివారం విద్యుత్ లైన్ల నిర్వహణ, చెట్టు కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నందున ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని జోన్-3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. ఈ కారణంగా ఏఎస్సార్ లే అవుట్, క్రికెట్ స్టేడియం చుట్టుపక్కల ఏరియాలలో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళా రేపు

భీమునిపట్నం: భీమిలిలోని మహిళా పాలిటెక్నిక్ కళాశాల వద్ద రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు సంస్థ ప్రతినిధి రమేష్‌నాయుడు తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి జరిగే మేళాలో పలు కంపెనీలు మహిళా అప్రెంటిస్, ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయసు గల అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఇతర వివరాలకు 90147 58949 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

మద్దిలో న్యాయ విజ్ఞాన సదస్సు నేడు

పద్మనాభం: మండలంలోని మద్దిలో ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించనున్నట్లు సీఐ సీహెచ్.శ్రీధర్ తెలిపారు. ఈ సదస్సుకు భీమునిపట్నం మేజిస్ట్రేట్ సౌజన్య, నార్త్ ఏసీపీ ఎస్.అప్పలరాజు హాజరవుతారని చెప్పారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు



కలశాలతో నీరు తీసుకువెళ్తున్న మహిళలు

పద్మనాభం: మండలంలోని లింగన్నపేటలో సిద్ధి వినాయక, సుబ్రహ్మణ్య స్వామి సహిత అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముందుగా గణపతి పూజ, విష్వక్సేన పూజ, పంచగవ్య ప్రాశన, గోపూజ, దీక్షధారణ వంటి పూజాదికాలు నిర్వహించారు. అనంతరం పూర్ణకలశాన్ని, విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు. మహిళలు కలశాలతో నీరు పట్టుకుని ఊరేగింపులో ముందుకు సాగారు. సర్పంచ్ పిన్నింటి సూర్యనారాయణ, పైల నారాయణరావు, పతివాడ అచ్చిబాబు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

నేడు క్షీరాధివాసం : ప్రతిష్టాపనోత్సవాల్లో భాగంగా ఆదివారం క్షీరాధివాసం, హోమాలు, రుద్రాభిషేకాలు నిర్వహిస్తారు. సోమవారం విగ్రహాల ప్రతిష్ట, ఆలయ ప్రవేశం జరగనున్నాయి.

చర్చికి ఇబ్బంది లేకుండా చూడాలని వినతి

భీమునిపట్నం: భీమిలిలోని చారిత్రక ఆంధ్ర బాప్టిస్ట్ చర్చికి రోడ్డు విస్తరణ సమయంలో ఇబ్బంది లేకుండా చూడాలని చర్చి సంఘం అధ్యక్షుడు కె.ఎస్.ఎం.సుధాకర్ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును కోరారు. సంఘం సభ్యులతో కలసి, శనివారం ఆయన ఎమ్మెల్యేను కలిశారు. చర్చిని ఆనుకుని ఉన్న రోడ్డు విస్తరణకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, అందులో చర్చికి ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు. సంఘ కార్యదర్శి ఎన్.రవికుమార్, కోశాధికారి పి.ఎస్.చంద్, సభ్యులు పాల్గొన్నారు.

పులి-బొమ్మ కార్డుల ఆట ఆడుతున్న నలుగురి అరెస్ట్

తగరపువలస: భీమిలి మండలం అన్నవరం తీరంలో పులి-బొమ్మ కార్డుల ఆట ఆడుతున్న నలుగురు వ్యక్తులను భీమిలి పోలీసులు శనివారం సాయంత్రం అరెస్ట్ చేశారు. చట్ట వ్యతిరేకమైన ఈ ఆట ఆడుతున్న వారి నుంచి రూ.2,150 నగదు, మూడు పులికార్డులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ తిరుమలరావు ఆధ్వర్యంలో ఎస్ఐ గంటా హరీష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఆరుబయట ఎండలో నిర్వహిస్తున్న సంత

ఆరు బయట సంత..
వ్యాపారుల చింత

- హుద్‌హుద్ తుఫాన్‌కు షెడ్లు శిథిలం
- ఎండకు ఎండి, వానకు తడుస్తున్న వైనం
- నీడ లేక పాడవుతున్న వస్తువులు
- వారపుసంతలో వ్యాపారుల అవస్థలు



సంతలో వర్షానికి తడుస్తున్న కూరగాయలు

పద్మనాభం: వారపుసంతలో నిలువ నీడ లేక వ్యాపారులు, వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. ఆరుబయట సంతలో నేలపై దుకాణాలు పెట్టుకుని, ఎండకు ఎండి, వానకు తడుస్తూ వ్యాపారాలు చేసుకోవలసిన పరిస్థితి. మరోవైపు వస్తువులూ పాడవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

పద్మనాభం జంక్షన్ సమీపంలో ప్రతి బుధవారం వారపు సంత జరుగుతుంది. గతంలో ఈ సంతలో దుకాణాలు పెట్టుకోవడానికి మూడు షెడ్లు ఉండగా, అవి 2014 అక్టోబర్‌లో వచ్చిన హుద్‌హుద్ తుఫాన్‌కు కూలిపోయాయి. షెడ్లు కూలిపోయి 11 ఏళ్లు దాటుతున్నా వీటిని పునర్నిర్మించలేదు. సంత ప్రతి బుధవారం రెండు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు జరుగుతుంది. సంతలో సుమారు 200 వందల వరకు దుకాణాలు పెడతారు. కూరగాయలు, మాంసం, చేపలు, దుస్తులు, పప్పు దినుసులు, గృహ అవసరాలకు ఉపయోగపడే వివిధ రకాలు వస్తువులు ఇక్కడ అందుబాటులో ఉంటాయి. విజయనగరం జిల్లా జామి మండలం వసంత, జామి, ఆనందపురం మండలం శిర్లపాలెం, భీమునిపట్నం మండలం లక్ష్మీపురం, దాకమర్రి, పద్మనాభం మండలం శేరిఖండం, అర్చకునిపాలెం గ్రామాల నుంచి వచ్చిన వ్యాపారులు ఈ దుకాణాలు పెడతారు.

22 గ్రామాలకు ఇదొక్కటే సంత..

పద్మనాభం మండలంలో 22 గ్రామాలు ఉన్నాయి. ఈ మండలానికంతటికీ ఇది ఒక్కటే సంత. విజయనగరం-కొంత్యాం ఆర్ అండ్ బీ రోడ్డు పక్కనే ఈ సంత జరుగుతుంది. అన్ని నిత్యావసర వస్తువులు ఒకేచోట దొరకడంతో వారానికి సరిపడిన వస్తువులతో పాటు ఆకుకూరలు, చేపలు వంటివి కూడా పద్మనాభం మండలంలోని అధిక శాతం గ్రామాల ప్రజలు, విజయనగరం, సింహాచలం వెళ్లే ప్రయాణికులు ఈ సంత వద్ద ఆగి కొనుగోలు చేసి తీసుకువెళ్తారు. అయితే, ప్రస్తుతం షెడ్లు లేకపోవడంతో ఆరుబయటే, నేల మీద దుకాణాలు పెట్టాల్సి వస్తోంది.

'మరుగు' లేక ..

మరుగుదొడ్లు లేకపోవడంతో దుకాణదారులు, వినియోగదారులు అత్యవసర సమయాల్లో మల, మూత్ర విసర్జనకు ఇబ్బంది పడుతున్నారు. సంత ప్రదేశంలో ఖాళీ స్థలం ఉన్నా విజయనగరం-కొంత్యాం ఆర్అండ్‌బీ రోడ్డును ఆనుకుని దుకాణాలు పెడుతున్నారు.

వానొస్తే ఇక అంతే..

వర్షం కురిసే సమయంలో సంత నిర్వహించే ప్రదేశమంతా బురదమయంగా తయారవడంతో వినియోగదారులు, దుకాణదారులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షానికి పప్పు దినుసులు, మాంసం, దుస్తులు, కారం, ఉల్లిపాయలు తడిసి పాడవడంతో వాపారులు ఆర్థికంగా నష్టపోతున్నారు. అటు వ్యాపారులు, ఇటు వినియోగదారులు తడిసి ముద్దవుతున్నారు. కొంతమంది వ్యాపారులు దుకాణాలపై టార్పాలిన్లు కప్పినా, గాలికి ఎగిరిపోవడంతో నిత్యావసర వస్తువులు తడిసిపోతున్నాయి. వేసవి కాలంలో ఎండలో మాడిపోతూనే, దుకాణాల వద్ద వస్తువులు అమ్ముతుంటారు.



వర్షానికి తడవకుండా తలపై గోనె సంచె కప్పుకున్న క్యాబేజీలు విక్రయిస్తున్న మహిళ

ట్రాఫిక్ జామ్..

వినియోగదారులు వస్తువులు కొనుగోలు చేసి రోడ్డు మీద నిలబడిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. ఈ రోడ్డుపై సింహాచలం, విజయనగరం, విశాఖపట్నం వెళ్లే బస్సులు, ఆటోలు, లారీలు, ద్విచక్ర వాహనాలు తిరుగుతూ ఉంటాయి. లారీలు, బస్సులు వంటి వాహనాలు ఎదురెదురుగా వచ్చేటప్పుడు వాహనాలు తప్పుకోవడమూ కష్టమవుతోంది. అధికారులు స్పందించి షెడ్లు నిర్మించాలని, మౌలిక వసతులు కల్పించాలని వ్యాపారులు, వినియోగదారులు కోరుతున్నారు.



పద్మనాభం సంత వద్ద జామ్ అయిన ట్రాఫిక్

వస్తువులు తడిసి పోతున్నాయి



నేను ప్రతి వారం సంతలో దుకాణం పెడతాను. కారం, మసాలా దినుసులు అమ్ముతుంటాను. షెడ్లు లేకపోవడంతో వర్షం వస్తే మా దుకాణంలో వస్తువులు పాడవుతున్నాయి. కొంత బాగున్న వాటిని ఇంటికి తీసుకువెళ్లి ఎండబెడతాను. లేదంటే వృథా అయిపోతాయి. దీంతో నష్టపోతున్నా.

– పి.మోహనరావు, దాకమర్రి

ఎండలో మాడిపోతున్నాం



నేను పిల్లలకు సంబంధించిన ఆట వస్తువులు తెచ్చి సంతలో అమ్ముతుంటాను. మధ్యాహ్నం రెండు గంటలకే సంతలో దుకాణం పెడతాం. మార్చి, ఏప్రిల్, మే నెలలో ఎండలు జాస్తిగా కాస్తాయి. షెడ్లు లేకపోవడంతో ఎండల బారిన పడుతున్నాం. చాలా ఇబ్బందిగా ఉంటోంది. షెడ్లు ఉంటే నీడ ఉంటుంది. అధికారులు మా ఇబ్బంది గుర్తించి షెడ్లు నిర్మించాలి.

– ఎస్.కోదండ, కుసులవాడ, ఆనందపురం మండలం

షెడ్లు నిర్మించాలి



సంతతో ప్రతివారం పప్పు దినుసులు అమ్ముతుంటాను. వర్షానికి ఇవి తడిసిపోతున్నాయి. షెడ్లు ఉండేటప్పుడు వర్షాలు కురిసినా మా వస్తువులు నిక్షేపంగా ఉండేవి. ఇప్పుడు తడిచిపోతున్నాయి. పాలకులు, అధికారులు దయతో నీడ కల్పిస్తే మాకూ, వస్తువులకూ కూడా రక్షణ ఉంటుంది.

– కె.బుచ్చిబాబు, వసంత గ్రామం, విజయనగరం



రోడ్డును ఆనుకుని పెట్టిన దుకాణాలు

పర్యావరణ హిత జీవనమే లక్ష్యం

- ప్లాస్టిక్ వస్తువులను నిషేధిద్దాం
- పరిశుభ్రతను పాటిద్దాం
- 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర' కార్యక్రమాల్లో వక్తలు



తాటితూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రాథమిక పాఠశాల విద్యార్థులు



టి.నగరపాలెంలో ప్రతిజ్ఞ చేస్తున్న సర్పంచ్ ఛాయా గౌతమి తదితరులు



కంచేరుపాలెంలో డివీస్ ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న పర్యావరణ ఇంజనీర్ కరుణరేఖ



చంద్రంపాలెం హైస్కూల్లో మాట్లాడుతున్న డీఈవో ప్రేమ్‌కుమార్



చిట్టివలస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు



రుషికొండ బీచ్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న ఆర్డీవో జగదీష్, డీటీవో సుధాసాగర్, అధికారులు



ప్లాస్టిక్ వస్తువులను నిషేధిస్తామని ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీపీ రాంబాబు, అధికారులు

తగరపువలస: పర్యావరణ హితంగా జీవనశైలి మార్చుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు. ప్రకృతికి హాని కలిగించే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ తదితర వస్తువులను నిషేధించాలన్నారు. పర్యావరణానికి మేలు చేసే వస్తువులనే వినియోగించాలని సూచించారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రలో భాగంగా గ్రామస్తులకు స్వచ్ఛత, పర్యావరణంపై అవగాహన కల్పించారు.

➡ తాటితూరు ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు కె.సన్యాసినాయుడు ఆధ్వర్యంలో విద్యార్థులు ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు.

➡ టి.నగరపాలెం పంచాయతీలో జరిగిన ర్యాలీ, ప్రతిజ్ఞ కార్యక్రమంలో ఎంపీడీవో హనుమంతరావు, సర్పంచ్ పాట్నూరు ఛాయాగౌతమి, ఎంపీటీసీ సభ్యురాలు పల్లా నీలిమ పాల్గొన్నారు.

➡ చిట్టివలస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీవాణి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జీవీఎంసీ శానిటేషన్ సిబ్బంది కాగితపు, జ్యూట్ సంచులను ప్రదర్శించారు. లక్ష్మీపురం జెడ్పీ హైస్కూల్, శింగనబంద పంచాయతీ కృష్ణంరాజుపేట యూపీ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో జి.పైడిరాజు, ర్యాలీ, పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు.

➡ దివీస్ లేబరేటరీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పర్యావరణ ఇంజనీరు కరుణరేఖ, సంస్థ ఈసీడీ విభాగం జనరల్ మేనేజర్ బాలాజీ తదితరులు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన 200 మందితో కంచేరుపాలెం లో ర్యాలీ నిర్వహించారు.

పాఠశాలల్లో 3 డస్ట్‌బిన్ల ఏర్పాటు: డీఈవో

మధురవాడ: పాఠశాలల్లో చెత్త సేకరణకు 3 రకాల డస్ట్ బిన్లు ఏర్పాటు చేయాలని డీఈవో ఎన్. ప్రేమ్‌కుమార్ ఆదేశించారు. చంద్రంపాలెం హైస్కూల్లో శనివారం నిర్వహించిన 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన విద్యార్థులతో కలసి ప్లకార్డులు ప్రదర్శించి, పరిశుభ్రత పనుల్లో చేతులు కలిపారు. హెచ్‌ఎం రవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొమ్మాది: పర్యాటక ప్రాంతాలను వ్యర్థరహితంగా తీర్చిదిద్దుతామని ఆర్డీవో, జిల్లా పర్యాటక శాఖ అధికారి సుధాసాగర్ తెలిపారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా రుషికొండ బీచ్‌లో వ్యర్థాలను తొలగించారు. ప్లాస్టిక్ నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు.4వ వార్డు చేపలుప్పాడలో కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహాలక్ష్మి నాయుడు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

పద్మనాభం: ప్లాస్టిక్ వస్తువులను నిషేధించాలని పద్మనాభంలో ప్రతిజ్ఞ చేశారు. ర్యాలీ,మానవహారం నిర్వహించారు. ఎంపీపీ కె. రాంబాబు, ఎంపీడీవో విజయ్ కుమార్, ఎంఈవో రమణ పాల్గొన్నారు.

అనునిత్యం అండగా ఉంటాం

ఎమ్మెల్సీ వరుదు కల్యాణి

మధురవాడ: వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు అనునిత్యం అండగా ఉంటామని ఎమ్మెల్సీ వరుదు కల్యాణి అన్నారు. వారి కష్టసుఖాల్లో పాలు పంచుకుంటామన్నారు. వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పిళ్లా సత్యనారాయణ మాతృమూర్తి అప్పలనర్సమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో, మారికవలసలోని ఆయన నివాసానికి వెళ్లి ఆయన్ను, ఏపీ నగరాలు కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ పిళ్లా సుజాత కుటుంబసభ్యులను కల్యాణి పరామర్శించారు. కార్యక్రమంలో సింహాచలం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు మాజీ సభ్యురాలు ముదుండి రాజేశ్వరి, సోషల్ మీడియా ఇన్‌చార్జి పిళ్లా సూరిబాబు, ఇతర నాయకులు పాల్గొన్నారు.



పిళ్లా సత్యనారాయణ కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న వరుదు కల్యాణి

సర్పంచ్‌ల ప్రమేయం లేకుండా అభివృద్ధి పనులా?

- ప్రశ్నించిన ముకుందపురం సర్పంచ్ గంగరాజు
- ప్రభుత్వ విభాగాల పనితీరుపై అధికారులు, ప్రజాప్రతినిధుల సమీక్ష

తగరపువలస: ఆనందపురం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ ప్రభుత్వ విభాగాల పనితీరుపై శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మజ్జి శారదా ప్రియాంక అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వ్యవసాయం, విద్య, రెవెన్యూ, హౌసింగ్, వైద్యం, పశు సంవర్ధకశాఖ, ఉపాధి హామీ పథకం, గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీరాజ్ విభాగాలపై సమీక్ష నిర్వహించారు. ప్రజాప్రతినిధులు అడిగిన సమస్యలకు అధికారులు వివరణ ఇచ్చారు. త్వరితగతిన వాటిని పూర్తి చేయాలని ఎంపీపీ ఆదేశించారు. ముకుందపురం సర్పంచ్ కలిమి గంగరాజు మాట్లాడుతూ సర్పంచ్‌ల ప్రమేయం లేకుండా కూటమి ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలు చేస్తోందన్నారు. ఇలాగే కొనసాగితే వాటని అడ్డుకుంటామని హెచ్చరించారు. పంచాయతీలో జగనన్న కాలనీకి రెండు రోడ్లు నిర్మించడంతో పాటు తాగునీటి సమస్య పరిష్కరించాలన్నారు. ఉపాధి హామీ పనులలో భాగంగా కొండవాలు ప్రాంతంలో కందకాలు తవ్వే బదులు సాగు నీటి కాలువలలో పూడికతీత పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జానకి, ప్రజాప్రతినిధులు మజ్జి వెంకటరావు, రొౌతు వెంకటరావు, కోరాడ రాంబాబు, కోన శ్రీను, కోన పైడిరాజు, బోని సన్యాసినాయుడు, అప్పలనాయుడు, తొమురోతు రాము, ఉప్పాడ కొండమ్మ, ఉప్పాడ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశానికి హాజరైన ఆనందపురం మండల అధికారులు, ప్రజాప్రతినిధులు

అసిస్టెంట్ ప్రొఫెసర్ రమేష్‌కు డాక్టరేట్



బొడ్డు రమేష్

తగరపువలస: భీమిలి మండలం దాకమర్రి రఘు ఇంజినీరింగ్ కళాశాల ఈసీఈ విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ బొడ్డు రమేష్‌కు ఒడిశాలోని కళింగ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ డాక్టరేట్ అందించింది. 'మినియేచర్ వైర్‌లెస్ పరికరాల కోసం లోపభూయిష్టమైన మైక్రో స్ట్రిప్ ఫిల్టరింగ్ యాంటెన్నాల రూపకల్పన' పరిశోధనపై డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీని పూర్తి చేశారు. జీఎస్ రాయ్, అరిందన్ దేబ్‌ల పర్యవేక్షణలో రమేష్ పరిశోధనలు చేశారు.

ఓటర్ల జాబితాల్లో సవరణలు తెలపాలి

భీమునిపట్నం: భీమిలి పరిధిలోని ఓటర్ల జాబితాల్లో సవరణలు, సూచనలు ఉంటే తెలపాలని డివిజనల్ పరిపాలన అధికారి మనోరంజని సూచించారు. ఆర్డీవో కార్యాలయం వద్ద రాజకీయ పార్టీ ప్రతినిధులతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటివరకు ఓటర్ల జాబితాల్లో లేనివారు పేర్లు నమోదు చేసుకునేలా చూడాలన్నారు. చనిపోయిన వారి వివరాలు ఇంకా తొలగించకపోతే వాటి గురించి తెలియపరచాలని కోరారు. ఎక్కడైనా పోలింగ్ బూత్‌లు సరిగ్గా లేకుంటే, వాటి వివరాలను అందిస్తే ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకు వెళతామని తెలిపారు. సమావేశంలో పార్టీల నాయకులు అల్లిపిల్లి నర్సింగరావు, గంటా నూకరాజు, సూర్యప్రకాశ్, రాజు, రాంబాబు, నిమ్మకాయల భాస్కర్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దారు భాస్కరరావు పాల్గొన్నారు.

పది పరీక్షలకు 14 కేంద్రాలు

భీమునిపట్నం: ఈ నెల 17వ తేదీ నుంచి 31వరకు జరగనున్న పదో తరగతి పరీక్షలకు భీమిలి పరిధిలో అన్ని ఏర్పాట్లు చేశామని ఎంఈవో శివరాణి తెలిపారు. 14 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇక్కడ మండల, జోన్ పరిధిలో 21 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, 20 ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పరీక్ష రాస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి బాలురు 495 మంది, బాలికలు 705 మంది మొత్తం 1200మంది హాజరు కానుండగా, ప్రైవేట్ పాఠశాలల్లో 993 మంది బాలురు, 638 బాలికలు 1631 హాజరవుతున్నారని చెప్పారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా, పరీక్ష కేంద్రాల వద్ద అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని తెలియజేశారు.

పద్మనాభంలో 4 కేంద్రాలు

పద్మనాభం: పదో తరగతి పరీక్షలకు సంబంధించి పద్మనాభం మండలంలో నాలుగు కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు ఎంఈవో పొన్నగంటి రమణ తెలిపారు. రెడ్డిపల్లి, పద్మనాభం, మద్ది, ఆర్‌వీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలకు 711 మంది హాజరు కానున్నారన్నారు. ఓపెన్ టెన్త్‌కు ఒక్క పద్మనాభం తప్ప మిగతా ఉన్నత పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఓపెన్ టెన్త్‌కు 175 మంది హాజరు కానున్నారని తెలిపారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

తగరపువలస: ఆనందపురం మండలంలో రూ.4 కోట్ల విలువైన అభివృద్ధి పనులను ఎంపీపీ మజ్జి శారదా ప్రియాంకతో కలిసి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శనివారం ప్రారంభించారు. వీటిలో గిడిజాల పంచాయతీ దిబ్బడిపాలెంలో స్వచ్ఛ భారత్ మిషన్, 30 కిలో లీటర్ల ఓవర్‌హెడ్ ట్యాంకు ఉన్న జలజీవన్ మిషన్ పథకాలు, ఇంటింటా కుళాయిలు, లొడగలవానిపాలెం పంచాయతీలో నూతనంగా నిర్మించిన కేజీబీవీ పాఠశాలలో తల్లిదండ్రుల విశ్రాంతి భవనాలు ఉన్నాయి. దిబ్బడిపాలెంలో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొని వీధులను శుభ్రం చేశారు. ఇంకుడు గుంతకు భూమిపూజ చేశారు. హరిత రాయబారులను సన్మానించి, బియ్యం అందించారు. ఎంపీటీసీ సభ్యురాలు రౌతు శ్యామల, ఎంపీడీవో జానకి తదితరులు పాల్గొన్నారు.

ఆరో వార్డులో..

పీఎం పాలెం: జీవీఎంసీ ఆరోవార్డులో రూ. 3.62 కోట్ల విలువ చేసే 11 అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శనివారం శంకుస్థాపన చేశారు. పీఎం పాలెం తులసీ నగర్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వార్డు పరిధిలోని సాయిప్రియ గార్డెన్స్, సంపత్ నగర్‌లో బీటీ రోడ్లు , డ్రైనులు నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీ కనకమహాలక్ష్మి, స్థానిక నాయకులు దాసరి శ్రీను, మొల్లి హేమలత తదితరులు పాల్గొన్నారు.



జల్ జీవన్ ఓవర్‌హెడ్ ట్యాంకును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంటా, ఎంపీపీ శారదా ప్రియాంక

టెన్త్ విద్యార్థులకు పరీక్ష మెటీరియల్ పంపిణీ



రాయప్పాలెం హైస్కూల్ విద్యార్థులకు మెటీరియల్ అందిస్తున్న సాయి సంహిత ట్రస్ట్ ప్రతినిధులు



భీమిలి హైస్కూల్ విద్యార్థులకు మెటీరియల్ అందిస్తున్న స్నిగ్ధశ్రీ ఫౌండేషన్ ప్రతినిధులు

తగరపువలస:రాయప్పాలెం హైస్కూల్లో పదో తరగతి విద్యార్థులకు సాయి సంహిత ట్రస్ట్ అధ్యక్షుడు రెడ్డిపల్లి అప్పలరాజు,మద్దిరెడ్డి సంతోషిణి ఆధ్వర్యంలో పరీక్ష మెటీరియల్ అందించారు. హెచ్ ఎం జయంతి రాధాకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

➡ భీమిలి జీవీఎంసీ మున్సిపల్ హైస్కూల్‌లో కలిగొట్ల స్నిగ్ధశ్రీ ఫౌండేషన్ అధ్యక్షుడు కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో 58 మంది విద్యార్థులకు పరీక్ష మెటీరియల్ అందించారు.

➡ ఆనందపురం మండలం సత్యసాయి ఆదర్శ గ్రామం గొట్టిపల్లి ఇంటిగ్రేటెడ్ సేవా మందిరం ఆధ్వర్యంలో జెడ్పీహైస్కూల్ విద్యార్థులకు పరీక్ష మెటీరియల్ పంపిణీ చేశారు. భజన మండలి సీనియర్ సేవాదళ్ కొట్యాడ లక్ష్మణమూర్తి సహకారంతో హెచ్ఎం బంటుపల్లి అప్పారావు వీటిని అందించారు.

వినియోగదారులు హక్కులను తెలుసుకోవాలి

భీమునిపట్నం: వినియోగదారులు తమ హక్కులను తెలుసుకోవాలని, అప్పుడే వారు మోసాలకు గురి కాకుండా ఉంటారని భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.విష్ణుమూర్తి అన్నారు. కళాశాల వద్ద శనివారం నిర్వహించిన ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవంలో ఆయన మాట్లాడారు. నాసిరకమైన వస్తువులు విక్రయిస్తే వారిపై వినియోగదారుల చట్టం ప్రకారం చర్యలు తీసుకోవచ్చని, దీని గురించి అందరూ తెలుసుకోవాలని సూచించారు. అధ్యాపకులు డాక్టర్ బి.సహదేవుడు, వై.శ్రీనివాసరావు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫంక్షన్ హాల్లో బంగారు నెక్లెస్ చోరీ

తగరపువలస: స్థానిక బైపాస్ రోడ్డులోని ఎంఎస్ఆర్ ఫంక్షన్ హాల్లోని రూమ్ నంబర్-2లో రెండు తులాల బంగారు నెక్లెస్ చోరీకి గురైందని విజయనగరం జిల్లా, భోగాపురం మండలం నందిగాం గ్రామానికి చెందిన పి.రమేష్ శనివారం భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫంక్షన్ హాల్లో శుక్రవారం జరిగిన బంధువుల పెళ్లికి అరబిందో ఫార్మసీలో కెమిస్ట్‌గా పని చేస్తున్న రమేష్ భార్యతో కలసి హాజరయ్యాడు. తమకు కేటాయించిన రూమ్‌లో లగేజీ ఉంచి, పెళ్లి అనంతరం రాత్రి 12.30 గంటలకు రూమ్‌కు వెళ్లారు. అక్కడ వస్తువులన్నీ చెల్లాచెదురుగా పడి ఉండటంతో ఫంక్షన్‌హాలు సూపర్‌వైజర్ సాయంతో సీసీ కెమెరాలో చూడగా రాత్రి 7.30 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి గదిలో నుంచి బయటకు రావడాన్ని గుర్తించారు. దీంతో అనుమానితుని గుర్తించి, చర్యలు తీసుకోవాలని బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు.